ఎమ్మెల్యే తలసానిని కలిసిన ఎంఐఎం నాయకులు

బేగంపేట్, ఏప్రిల్ 12: నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసి పవిత్రంగా జరుపుకునే పండగ రంజాన్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రంజాన్ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్ పేట్, బేగంపేట్, డివిజన్‌లకు చెందిన పలువురు ముస్లింలు శుక్రవారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఆయనను కలిసిన సందర్భంగా ఎమ్మెల్యే తలసాని వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కిశోర్‌కుమార్, శ్రీహరి, ఆరీఫ్, వాహెద్, రజాక్ అబ్బాస్, జహంగీర్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 12: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని బీజేపీ మెట్టుగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్కోట్ విజయకుమార్ పిలుపునిచ్చారు. నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతున్నదని చెప్పారు. యువత దీనిపై దృష్టి సారించాలని కోరారు. తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సబితావిజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు రోజుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు యువతలో ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

బైసాఖి ఉత్సవాలకు ఎమ్మెల్యేలకు ఆహ్వానం

అమీర్‌పేట్‌లోని గురుద్వారాలో శనివారం నిర్వహించే బైసాఖి ఉత్సవాలకు రావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి పద్మారావును సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం ప్రబంధక్ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానించారు. – సికింద్రాబాద్

గురుద్వారా ప్రబంధక్ కమిటీ అమీర్‌పేట్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరుగుతున్న 325వ ఖల్సా సాజనా దివస్ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ప్రబంధక్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గురుద్వారా అధ్యక్షుడు సర్దార్ దర్శన్‌సింగ్, కార్యదర్శి సురిందర్‌సింగ్, చైర్మన్ అజిత్‌సింగ్ ఇతర కమిటీ సభ్యులున్నారు. – అమీర్‌పేట్

శాలువా కప్పి: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా సాయన్న కూతురు నివేదితను బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన సందర్భంగా శుక్రవారం బోయిన్‌పల్లిలోని మర్రి క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డిని కలిసి శాలువా కప్పి పూలబొకే అందజేశారు. అనంతరం త్వరలో జరగబోయే కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. – కంటోన్మెంట్

ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు అండగా ఉంటాం

కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితను కలిసి మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 12: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. పలు వార్డులకు చెందిన నాయకులు ఆమెను కలిసి మద్దతు ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పలు వార్డులకు చెందిన బీఆర్ఎస్ నేతలు కార్ఖానాలోని ఆమె క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితతో సమావేశమయ్యారు. ఉప ఎన్నికల్లో గులాబీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సాయన్న కుటుంబానికి అండగా ఉండేందుకు యావత్ కంటోన్మెంట్ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

నివేదితను కలిసిన వారిలో సీనియర్ నాయకులు రవికుమార్, రవి, హేమంత్, ఉదయ్, ఉమేశ్, దీనానాథ్ యాదవ్, మురళీ యాదవ్, ఆనంద్, పెంట శ్రీహరి, భాస్కర్ ముదిరాజ్, రాజు, శత్రు ఘ్ను మధు, దర్శన్ తదితరులు ఉన్నారు.

సికింద్రాబాద్ ఎంపీగా..

పద్మారావుగౌడ్ గెలవాలి

కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న అడ్డగుట్ట కార్పొరేటర్ ,మహిళా నేతలు

సికింద్రాబాద్,ఏప్రిల్ 12: సికింద్రాబాద్ ఎంపీగా పద్మారావుగౌడ్ భారీ ఆధిక్యతతో గెలుపొందాలని కోరుతూ అడ్డగుట్ట మహిళా నేతలు కొమురవెల్లి మల్లన్నకు మొక్కుకున్నారు. శుక్రవారం అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లతో కలిసి కొమురవెళ్లి మల్లన్న స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ..సికింద్రాబాద్ ఎంపీగా పద్మారావుగౌడ్ భారీ మెజార్టీతో గెలవాలని మొక్కుకున్నట్లు తెలిపారు. మల్లన్నస్వామిని దర్శించుకున్న వారిలో మహిళా నాయకురాళ్లు వసంత, అంజమ్మ, శారద, విమల, విజయ, చిన్న, రజిని, అబ్బమ్మ, మల్లమ్మ, బాలమణి, కనకమ్మ, నర్సమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ ఎంపీగా పద్మారావుగౌడ్ గెలవాలని కొమురవెల్లి మల్లన్నకు పూజలు చేసిన అడ్డగుట్ట కార్పొరేటర్ ,మహిళా నేతలు

రేపు పటేల్ యూత్ ఫోర్స్ గర్జన

ఖైరతాబాద్, ఏప్రిల్ 12: కరీంనగర్‌లో ఈనెల 14న జరిగే పటేల్ యూత్ ఫోర్స్ గర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్‌పటేల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పగడాల అరుణ్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. పటేల్ యూత్ ఫోర్స్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీలోని వీ కన్వెన్షన్‌లో గర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు.

కంటోన్మెంట్ సీటెవరికో!

- ఇప్పటికీ ఖరారు కాని బీజేపీ అభ్యర్థి..!

కంటోన్మెంట్‌లోని బీజేపీ నేతల్లో సఖ్యత కరువు

కంటోన్మెంట్, ఏప్రిల్ 12: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నిక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనే దాని విషయంలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించగా బీజేపీ అభ్యర్థి ఎవరబ్బా..? అని స్థానిక నాయకులు ఆరా తీస్తున్నారు. ప్రధానంగా పలువురు నేతలు టికెట్ కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. కంటోన్మెంట్‌లోని బీజేపీ నేతల్లో సఖ్యత కొరవడడంతో అభ్యర్థిపై ఇంకా ఎటూ తేలడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి ఉద్యమకారుడైన ఓ మాజీ కార్పొరేషన్ చైర్మన్‌కు టికెట్ ఇస్తే గెలిపించుకుని తీరుతామని ఓ వర్గం గట్టిగా వాదన వినిపిస్తుండగా మరో వర్గానికి చెందిన నాయకులు మాత్రం ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యం గా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నవారికే టికెట్ దక్కుతుందని ప్రచారం సాగుతున్నా.. సర్వేలు, గెలుపు ఆధారంగా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని నేతలు అంటున్నారు. టికెట్ ఆశిస్తున్న వారిలో మాత్రం నానాటికీ టెన్షన్ వాతావరణం నెలకొంది.

బీజేపీ ధార్మిక పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సుబోధ్‌గుప్తా

బేగంపేట్, ఏప్రిల్ 12: భారతీయ జనతా పార్టీ ధార్మిక పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సికింద్రాబాద్‌కు చెందిన చొల్లెటి సుభోద్ గుప్తాను నియమించారు. ఈ మేరకు నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎంఎల్సీ ఎన్ రామచంద్రారావు నియామక పత్రాన్ని సుభోద్‌గుప్తాకు అందజేశారు. ఈ సందర్భంగా సుభోద్‌గుప్తా మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన బీజేపీ తెలంగాణ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ సూర్య ప్రకాశ్‌కు రాంచంద్రారావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నెరవేరుస్తానన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరిస్తా

చిక్కడపల్లి : గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి టోని స్ట్రీట్ నంబర్ 1,2 బాపునగర్ ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరాను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కలుషిత నీటి సరఫరా జరుగుతున్న ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటించి సమస్యను తెలుసుకొని పరిష్కరించాలని కోరారు.

రేపు బ్లూ షర్ట్స్ బ్లూ మార్చ్

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 12: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న బ్లూ షర్ట్స్ – బ్లూ మార్చ్‌ను నిర్వహించనున్నారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మార్చ్‌ను జయప్రదం చేయాలని మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామగళ్ల సుందర్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనరర్ బోరెల్లి సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందర్, సురేశ్ మాట్లాడుతూ 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం – కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం' అనే నినాదంతో ఈ మార్చ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న సాయంత్రం నాలుగు గంటలకు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం వరకు అందరూ బ్లూ షర్ట్స్ ధరించి మార్చ్‌లో పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శ్రీశైలం, ప్రసాద్, భిక్షం, శ్రీకాంత్, గణేశ్, ప్రభాకర్, రేవంత్, కర్ణాకర్, ప్రవీణ్, మోహన్, మధు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

సికింద్రాబాద్,ఏప్రిల్ 12: వారాసిగూడలోని సాయి అమ్ములు ఆసుపత్రి వద్ద శుక్రవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని వారాసిగూడలోని సాయి అమ్ములు ఆసుపత్రి డాక్టర్ మృణాళిని ప్రారంభించారు.ప్రతి వారం రెండు రోజుల పాటు శుక్ర,శనివారాల్లో అనాథలు ,రోడ్లపై ఉన్న వారికి అదే విధంగా ఏ ఆధారం లేకుండా ఉన్న వారికి అన్నదానం చేస్తున్నట్లు డాక్టర్ మృణాళిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మహదేవన్ రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీది.. ప్రజా పక్ష పోరాటం

మల్కాజిగిరి, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతోందని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఆర్‌కే నగర్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి డివిజన్ నాయకుల సమీక్ష సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేదబడుగు వర్గాల కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి సంక్షేమ పథకాలు అమలుపరిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. గత ఎన్నికల ప్రచారంలో కల్లబొల్లి మాటలు చెప్పడంతో పాటు ఆరు గ్యారెంటీలను అమలుపరుస్తామని అబద్ధమాడరన్నారు. అయి తే, దరఖాస్తు చేసుకున్న వారికి 200 యూ నిట్ల విద్యుత్ ఉచిత విద్యుత్ ఇస్తామని, ఇప్పుడు బిల్లులు పంపిస్తున్నారని పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి తర్వాత మల్కాజిగిరి గడప తొక్కలేదన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్య విధానం ఉత్తమం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 12: అనేక రోగాల బారిన పడుతున్న మానవ శరీరానికి ఉత్తమమైన వైద్యవిధానం ఆక్యుపంక్చర్ అండ్ నేచురోపతి అని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సబితా విజయ్ అన్నారు. శరీరానికి తనకు తానుగా బాగు చేసుకునే శక్తి ఉందని, ఆక్యుపంక్చర్ చికిత్స శరీరంలోని శక్తి మార్గాలను ప్రేరేపిస్తుందని చెప్పారు. మనిషి జీవనశైలిని మార్చుకుంటున్న తరుణంలో అనేక శారీరక సమస్యలు ఎదురవుతున్నాయ్యారు. సత్వరమే రిలీఫ్ కోసం చిన్న చిన్న జబ్బులకే ఆసుపత్రులకు పరిగెత్తి వైద్య ఖర్చులను పెంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఎటువంటి మందులు వాడకుండా జబ్బులను తగ్గించేందుకు ఆక్యుపంక్చర్ వైద్య విధానం ఉత్తమ మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో కె. కృష్ణారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు నాగేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో మార్పులు అవసరం

ఖైరతాబాద్, ఏప్రిల్ 12: రాష్ట్రంలో ఉన్నత విద్యా విధానంలో సమూల మార్పులు చేయాలని తెలంగాణ మేధావుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరస్వామి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభు త్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో వేర్వేరు విధానాలున్నాయన్నారు. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదన్నా రు. డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లలో బీఏ, బీకాం, బీఎస్సీ మొత్తం సబ్జెక్టులన్నింటినీ ఒకే జాబితాగా చేయాలన్నారు. నచ్చిన ఏదైనా మూడు సబ్జెక్టులను ఎంపిక చేసుకునే విధంగా వీలు కల్పించాలన్నారు. డిగ్రీ సబ్జెక్టులతో సంబంధం లేకుండా పీజీలో ఎంట్రన్స్ రాయడానికి అవకాశం కల్పించాలన్నారు. అలాగే ఎన్ని కోర్సులైనా చదువుకునే వీలు కల్పించాలని, అందుకు స్కాలర్‌షిప్‌లను అందజేయాలన్నారు.

తలసానిని కలిసిన మైనార్టీ నాయకులు

'ఈద్ –ఉల్ –ఫితర్' (రంజాన్) పర్వదినం మరుసటి రోజైన శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. వారందరికి ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ అబ్బాస్ ఇంట్లో తయారు చేసిన 'షీర్ కుర్మా పాయసం' ఆయనకు అందజేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కే.లక్ష్మిపతి, రజాక్, అబ్బాస్, జహంగీర్, లంక రాజు, నాగభూషణం, కుశాల్ పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్

సంప్రదాయబద్ధంగా 'అమృత్ సంచార్'

అమీర్‌పేట్, ఏప్రిల్ 12: 325వ ఖల్సా సాజ్‌నా దివస్ (సిక్కు మత వ్యవస్థాపక దినం) పురస్కరించుకొని అమీర్‌పేట్‌లోని గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే వైశాఖి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల తొలి రోజున అమృత్ సంచార్ (హోలీ బాప్టిజమ్) నిర్వహించారు. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయాన్ని ప్రత్యేకంగా విచ్చేసిన సిక్కు మత గురువులు (రాగి జత్తాలు) గురుగ్రంథాన్ని పటిస్తూ, గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ రూపొందించిన అమృత్ పానీయాన్ని తయారు చేశారు. మనస్ఫూర్తిగా సిక్కు మత సంప్రదాయాలను పాటించేందుకు సిద్ధమైన యువతీ యువకులు, మహిళలు, పిల్లలు మత గురువుల చేతుల మీదుగా అమృత్ పానియాన్ని స్వీకరించారు. పవిత్ర పానియాన్ని స్వీకరించిన వారు జీవితాంతం సిక్కు మత నిబంధనలైన కేశ్, కంగన్, కడా, కృపాణ్, కచేరాగా పిలవబడే అయిదు నిబంధనలను విధిగా పాటించాల్సి ఉంటుందని మత గురువులు తెలిపారు. ఈ వేడుకలను ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ అమీర్‌పేట్ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శన్ సింగ్, సర్దార్ సురిందర్‌సింగ్, ఉపాధ్యక్షులు సర్దార్ కుశ్వంత్ సింగ్, సర్దార్ లాహోర్‌సింగ్, ఛైర్మన్ సర్దార్ అజిత్‌సింగ్‌లు పర్యవేక్షించారు. ఈ వేడుకలకు తరలివచ్చిన సిక్కులతో పాటు ఇతరులు లంగర్ స్వీకరించారు. స్థానికులు ఈ సందర్భంగా షర్బత్ పంపిణీ చేశారు.

మత గురువుల నుంచి అమృత్‌ను స్వీకరిస్తున్న యువతి

ఫ్రీలెఫ్ట్ బ్లాక్ చేసే వారిపై కఠినంగా ఉండండి

నో పార్కింగ్ జోన్లలో మరింత అవగాహన కల్పించండి: సిబ్బందిని ఆదేశించిన ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు

బంజారాహిల్స్, ఏప్రిల్ 12: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిచేవారిని ఎప్పటికప్పుడు హెచ్చరించడంతో పాటు పద్ధతి మార్చుకోకుంటే జరిమానాలు విధించడం ద్వారా కట్టడి చేయాలని ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్‌తో కలిసి శుక్రవారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్ చౌరస్తా, అగ్రసేన్ చౌరస్తా, బంజారాహిల్స్ రోడ్ నం. 1, 12 చౌరస్తా, జహీరానగర్ చౌరస్తా ప్రాంతాల్లో పర్యటించారు. సిగ్నళ్ల వద్ద ఫ్రీలెఫ్ట్‌లు బ్లాక్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించాలని, ఫ్రీ లెఫ్ట్‌లను బ్లాక్ చేయడంతో పాటు సిగ్నళ్లవద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాంటి వాహనాలపై జరిమానాలు విధించడంతో పాటు చౌరస్తాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు ఉల్లంఘలనకు పాల్పడుతున్న వారిని కట్టడి చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. రద్దీ రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసే వాహనాలకు జరిమానాలు వేయడంతో పాటు మొబైల్ పార్టీలు తమ వద్ద అందుబాటులో ఉన్న పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా హెచ్చరికలు జారీ చేస్తే అయా ప్రాంతాల్లో ఇతర వ్యక్తులు అప్రమత్తమమై సరైన రీతిలో పార్కింగ్ చేస్తారన్నారు. సిగ్నళ్ల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు, ఏసీపీ హరిప్రసాద్

నేడు సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి పర్యటన

సికింద్రాబాద్,ఏప్రిల్ 12: కేంద్ర మంత్రి,సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి నేడు(శనివారం) సికింద్రాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవి ప్రసాద్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ పరిధిలోని బౌద్ధనగర్, సీతాఫల్‌మండి తదితర డివిజన్‌ల పరిధిలో సాయంత్రం ఐదు గంటలకు బౌద్ధనగర్ మెయిన్‌రోడ్‌లోని పాత అన్నపూర్ణ మెస్ వద్ద నుంచి రాఘవేంద్ర నగర్, అంబర్ నగర్,పార్సిగుట్ట,అశోక్ నగర్,నారాయణ నగర్, వారాసిగూడ నుంచి ఇందిరానగర్, సీతాఫల్‌మండిలోని బీదల బస్తీ, ఉప్పర బస్తి, శ్రీనివాస్ నగర్ ,చిలకలగూడ తదితర ప్రాంతాల్లో కిషన్‌రెడ్డి పర్యటన కొనసాగుతుందన్నారు.

సెవెన్ స్క్రీన్ థియేటర్లకు అనుమతులివ్వద్దు

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ముషీరాబాద్, ఏప్రిల్ 12 : ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేయబోతున్న సెవెన్ స్క్రీన్ థియేటర్లకు అనుమతులు ఇవ్వకూడదని బీఆర్ఎస్ గ్రేటర్ నాయకుడు ఎంఎన్. శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ క్రాస్ రోడ్ చుట్టూ ఉన్న థియేటర్లు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక వాడలకు వచ్చిపోయే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. స్థానికులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పాత సుదర్శన్ థియేటర్, ఓడియన్ థియేటర్ల స్థానంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయబోతున్న ఏడు స్క్రీన్లు, మరో భవనంలో ఏర్పాటు చేయబోతున్న థియేటర్లకు అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వాన్ని కోరారు.

14న ఉచిత వైద్యశిబిరం

కాచిగూడ, ఏప్రిల్ 12: జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో రేపు ఉదయం 9:30 నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కరాటే మాస్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..బీపీ, షుగర్, ఫిజియోథెరిపీ, దంతవైద్యం నిర్వహిస్తున్నామని, ముఖ్యఅతిథిగా హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.